క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మహాకుంభాభిషేకం



విశేషాలంకరణలో అలఘునాథ స్వామి

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న అలఘునాథ స్వామి ఆలయంలో పుష్కర కుంభాభిషేక పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. యాగశాలలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, నవకలశ స్థాపన, ఉత్సవమూర్తులకు విశేష ద్రవ్యాలతో అభిషేకం చేశారు. మహా నివేదన అనంతరం మంగళ హారతి ఇచ్చారు. భక్తులకు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం హోమగుండంలో అగ్నిప్రతిష్టాపన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం గావించారు. నిర్వాహకులు కేవీ శేషారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు యానాదిరెడ్డి, అర్చకులు శ్రీనివాసశర్మ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ చేశారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉదయగిరి రూరల్: మండలంలోని వెంగళరావునగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-1 టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులు నూర్జహాన్, కేసీ మాలకొండయ్య, డి.వెంగళరావు, ఎల్‌ఏపీఎస్ భగవాన్ శాస్త్రి, షబానా నిగాహత్, రఫీలను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.రమేష్ పాల్గొన్నారు.

కసుమూరు దర్గా ఈఓ పరిశీలన



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా నుంచి ముస్లింల శ్మశానవాటికకు వెళ్లే మార్గాన్ని కసుమూరు దర్గా ఈఓ షరీఫ్ మంగళవారం పరిశీలించారు. స్థానికంగా వ్యక్తమవుతున్న అభ్యంతరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దర్గా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో దర్గా అకౌంటెంట్ ఖాజా హుస్సేన్, స్థానిక మైనారిటీ నాయకులు జిలానిబాషా, రెహమత్ నవాజ్ పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి



కావలి (జలదంకి): కావలి మండలం ఆనెమడుగు గ్రామంలో బీపీసీఎల్ కంపెనీకి ప్రజల నుంచి బలవంతపు భూ సేకరణను ఆపాలని గ్రామ ప్రజలతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం కావలిలో సబ్ కలెక్టర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరి మాల్యాద్రి, మండల కార్యదర్శి రాధాకృష్ణయ్య, గ్రామస్తులు జయరామిరెడ్డి, వెంకట్రావ్, రవీంద్ర, మాదవరావు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఆత్మకూరు: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీయూడబ్ల్యూజే నేతలు ఆర్డీఓ పావనిని కోరారు. ఈ మేరకు ఆమె కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఇళ్ల స్థలాల మంజూరు, హెల్త్ స్కీము సక్రమంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు సోమా వెంకటసుబ్బయ్య, బి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ సుబ్బారావు, ఆర్.రమణారెడ్డి, రెహమత్ అలీ పాల్గొన్నారు.

244 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 244 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 358 బేళ్లు రాగా వాటిలో 244 బేళ్లను విక్రయించామని చెప్పారు. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.280 కాగా కనిష్ట ధర రూ.159 లభించింది. మొత్తమ్మీద సగటు ధర రూ.232.01గా నమోదైంది. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల దందా.. ఆపే దమ్ముందా?

యథేచ్ఛగా గ్రావెల్, చెరువు మట్టి దోపిడీ

• అనధికార లేఅవుట్‌లకు తరలింపు • నిద్రావస్థలో అధికారులు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రావెల్, చెరువు మట్టి, ఇసుకను తమ్ముళ్లు యథేచ్ఛగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ముఖ్యంగా స్థానిక మండల, గ్రామాల్లోని టీడీపీ నాయకుల ప్రమేయంతో అక్రమ తరలింపులు సాగిపోతున్నాయి. వీటి గురించి ప్రశ్నించేవారే లేకపోవడంతో అధికారులు, మామూళ్లకు అలవాటుపడి కిమ్మనకుండా ఉన్నారు. ఈ అక్రమ తవ్వకాలు, తరలింపులు కేవలం నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరుకే పరిమితం కాకుండా సంగం, చేజర్ల, అనుమసముద్రంపేట, అనంతసాగరం మండలాల్లో రోజుల తరబడి సాగుతోంది.

– ఆత్మకూరు

సంగం మండలం జెండాదిబ్బ వద్ద జాతీయ రహదారి సమీపంలో వెంచర్లకు తోలిన గ్రావెల్



నిబంధనలు తూచ్

ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు చెరువుల మట్టి తోలుకొని వ్యవసాయ భూముల అభివృద్ధి చేసుకునేందుకు మాత్రమే అనుమతి ఉంది. అది కూడా క్యూబిక్ మీటరుకు ఒక రూపాయి వంతున చెల్లించి చెరువు మట్టిని తరలించుకోవచ్చు. కానీ దానికి విరుద్ధంగా ప్రైవేట్‌గా ప్లాట్లు ఏర్పాటు చేసే రియాల్టర్లు చెరువుల మట్టిని దర్జాగా తరలిస్తున్నారు. పొలాలకు కాకుండా ఇతర ప్రయోజనాలకు చెరువులు, వాగులు, కుంటల్లోని మట్టిని తరలించాలంటే క్యూబిక్ మీటరుకు 190 రూపాయలు చెల్లించాలనే ప్రభుత్వ నిబంధన ఉంది. అయితే రైతుల పొలాలకు తరలించేలా అనుమతులు పొంది యథేచ్ఛగా వెంచర్లకు తరలిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అన్నిచోట్లా ఇదే పరిస్థితి



ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ముస్తాపురం చెరువు వద్ద టిప్పర్లకు లోడ్ చేస్తున్న మట్టి

నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో అక్రమంగా లేఅవుట్‌లు వెలుస్తున్నాయి. వీటికి మట్టిని తరలించేందుకు కొద్ది రోజుల క్రితం ఆత్మకూరు చెరువు నుంచి తరలించగా ప్రస్తుతం మున్సిపల్ పరిధిలోని ముస్తాపురం చెరువు నుంచి లేఅవుట్‌లకు తరలిస్తున్నారు.

➤ చేజర్ల మండలంలోని తూర్పుకంభంపాడు యర్రకుంట (చిన్నచెరువు) నుంచి చెరువు మట్టిని సమీపంలోని కాకివాయి గ్రామానికి తరలిస్తున్నారు. నోటిమాటగా తహసీల్దారు అనుమతులు ఇచ్చారని చెబుతుండగా, అదే సమయంలో పొలాలకు తోలుకుందామని వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కుంట వద్దకు వెళ్లగా టీడీపీకి చెందిన వారు రానీయకుండా అడ్డుకున్నారని స్థానికులు తెలిపారు. ఈ తతంగంలో టీకేపాడు గ్రామ నాయకుడితో పాటు విలేకరిగా చెప్పుకునే ఓ వ్యక్తి ప్రమేయం ఉందని గ్రామస్తులు తెలిపారు. దీని విషయమై తహసీల్దార్ మురళీని సంప్రదించగా వీఆర్వోను పంపి మట్టి తోలకాలు నిలిపివేస్తానని చెప్పి టీడీపీ వారు తరలించుకున్న అనంతరం నిలిపివేశారు.

➤ సంగం మండలంలోని జెండాదిబ్బలో (హైవేకు సమీపంలో) ఏర్పాటు చేస్తున్న వెంచర్లకు మండలంలోని కొరిమెర్ల తిప్ప వద్ద నుంచి యథేచ్ఛగా రాత్రి సమయాల్లో పదుల కొద్ది టిప్పర్లతో తరలించారు. దీనికి మండలంలోని ముఖ్యఅధికారులు సహకరించారని సమాచారం.

➤ అనంతసాగరం మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో ప్రభుత్వ అధీనంలోని ఫారెస్ట్ నుంచి ట్రాక్టర్లతో రేవూరుకు మట్టిని అక్రమంగా తరలించారు. అదే విధంగా మంచాలపల్లి గ్రామ శివార్లలోని కొండ పోరంబోకు భూముల్లోని గ్రావెల్‌ను సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఇళ్ల స్థలాలకు తరలించారు. ఇందులోనూ టీడీపీ నాయకుల పాత్రే ప్రాధాన్యమైంది.

➤ అనుమసముద్రంపేట మండలంలోని కొండమీదకొండూరు గ్రామ సమీపంలో గ్రావెల్‌ను ఏఎస్‌పేటలోని వెంచర్లకు, ఆత్మకూరు–ఏఎస్‌పేట రహదారి పక్కన ఏర్పాటు చేసిన వెంచర్లకు తరలించారు. ఇందులోనూ అధికారుల పాత్ర కీలకమైంది.

➤ ఇలా అక్రమంగా చెరువు మట్టి, కొండ ప్రాంతాల్లోని గ్రావెల్, అటవీ ప్రాంతంలోని మట్టి తరలిస్తున్నా.. సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు. దీనిని జిల్లా ఉన్నతాధికారులైనా పరిశీలించి ప్రభుత్వ ఆదాయానికి పడే గండిని నిలువరించాలని కోరుతున్నారు.



చేజర్ల మండలం టీకేపాడులో మట్టి తరలించగా ఏర్పడిన గుంతలు



సంగం మండలం జెండాదిబ్బ వద్ద జాతీయ రహదారి సమీపంలో వెంచర్లకు తోలిన గ్రావెల్



అనంతసాగరం: వెంకటరెడ్డిపల్లి నుంచి రేవూరుకు అక్రమంగా గ్రావెల్ తరలింపు

దళితుల హక్కులు కాపాడేలా చర్యలు



విజిలెన్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఆత్మకూరు: దళితుల హక్కులను కాపాడేందుకు ప్రతిఒక్కరం కృషి చేద్దామని, వారికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుందామని ఆత్మకూరు ఆర్డీఓ పావని అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళిత తెగలకు సంబంధించిన సమస్యలు, మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు అధికారులకు తొలుత సమాచారం అందుతుందని, వెంటనే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అక్కడ పరిష్కారం కాని వాటిని డివిజన్ స్థాయిలో తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వారికి ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడంలో అధికారులు ముందుండాలని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు సిద్ధం పెంచలనరసయ్య, యర్రగుంట పెంచలయ్య పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఎంపీడీఓలు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, ఇరిగేషన్, విద్యుత్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



నిరసన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సెల్‌ఫోన్లను కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకుడు కోడె రమణయ్య మాట్లాడుతూ సక్రమంగా పనిచేయని సెల్‌ఫోన్ల ద్వారా నెట్‌వర్క్ పనిచేయక, సెల్ సిగ్నల్స్ సక్రమంగా అందకపోవడంతో వారు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే పలువురి ఫోన్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. కార్యకర్తలకు 5జీ ఫోన్లు ఇవ్వాలన్నారు. యాప్‌ల భారం తగ్గించాలన్నారు. బాల సంజీవని యాప్, ఓటీపీ, ఈకేవైసీ నిబంధనలు తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రమీల, కళావతి, శ్రీదేవి, రత్నకుమారి, ఆదిలక్ష్మి, ఫణి రాజకుమారి, హుస్సేన్‌బి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా



విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సోమశిల: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం అనంతసాగరం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వారు కార్యాలయంలోనికి వెళ్లగా విద్యుత్ శాఖ ఏఈ డ్యూటీలో లేకపోవడంతో ఆయన కుర్చీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు డాక్టర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ వివిధ పేర్లతో ప్రజలపై అదనపు బిల్లులతో మోత వేస్తున్నారని, వాటిని రద్దు చేసి చార్జీలు తగ్గించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే లోకేశ్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా, మండల కమిటీ సభ్యులు ఉప్పలపాడు మస్తాన్, జక్రయ్య, కనగాల శీను, వెంకటేష్, నరసింహులు, మీరా మొహిద్దిన్, గౌస్‌బాషా పాల్గొన్నారు.

ఈ–కేవైసీతో ప్రభుత్వ పథకాలు

ఆత్మకూరురూరల్: రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ–కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కిశోర్‌బాబు అన్నారు. మండలంలోని చెర్లోయడవల్లి, మురగళ్ల రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు పలు అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రత్యూష, బేబి ఆయేషా, స్థానిక రైతులు పాల్గొన్నారు.

• **మర్రిపాడు:** మండలంలోని చుంచులూరు, పడమటినాయుడుపల్లి గ్రామాల్లోని పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం సందర్శించారు. ఉదయగిరి ఏడీఏ లక్ష్మీమాధవి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు సురేఖ, హసీనాబానులు చుంచులూరు గ్రామంలో వేరుశనగ, సజ్జ పొలాలను సందర్శించారు. వేరుశనగలో రసం పీల్చే పురుగులను గుర్తించి నివారణ చర్యలు వివరించారు. ఏఓ కవిత, మండల విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, వీఏఏ మల్లెం కొండయ్య రైతులు పాల్గొన్నారు.

• **దుత్తలూరు:** సాగులో ఉన్న మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించామని పొదలకూరు వ్యవసాయ పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త వి.సురేఖదేవి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తెడ్డుపాడులో సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా నివారణ చర్యల గురించి వివరించారు. ఉదయగిరి ఏడీఏ లక్ష్మీమాధవి, సర్పంచ్ వెంకటరత్నం, వ్యవసాయాధికారులు సుబ్బారెడ్డి, మదన్ మోహన్, ఏఈఓ సుస్మిత పాల్గొన్నారు.

• **సీతారామపురం:** రైతులు సాగు చేసిన పంటల వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించాలని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి అన్నారు. ఆయన మంగళవారం బసినేనిపల్లి, సీతారామపురం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. సాగుచేసిన ప్రతి రైతు ఈ–పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సుధీర్‌కుమార్, సాంబయ్య, వీఏఏ పవన్, రైతులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

కొండాపురం: కొండాపురం మండలంలో ఏపీటీఎఫ్–1938 ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది. అసోసియేషన్ మండలాధ్యక్షుడు వి.మాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, జి.చినబాబు, ఎన్.సుధీర్. మల్లికార్జునరెడ్డి. శ్రీనువాసులురెడ్డి, ఎస్.నాగేశ్వరరావు, ఎ.వీరరాఘవులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రీవెన్స్ డే నేడు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రత్యేక గ్రీవెన్స్ డే కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ రామ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆత్మకూరు ఆర్డీఓ పావనితో పాటు, అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంకితభావంతో విధుల నిర్వహణ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని మండల వైద్యాధికారిణి వినీత అన్నారు. ఆమె మంగళవారం పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్ గదిలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. యాప్‌లలో సమగ్ర సమాచారం పొందుపరచాలన్నారు. తల్లీబిడ్డల సమాచారం అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

పోలేరమ్మ సేవలో మంత్రి ఆనం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం చిరమన గ్రామంలోని పోలేరమ్మ తల్లి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో హాస్టల్ వసతి కల్పించాలి

ఉదయగిరి: పట్టణంలో పేద విద్యార్థుల సౌకర్యార్థం హాస్టల్ సౌకర్యం కల్పించాలని జన విజ్ఞాన వేదిక, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు షేక్.దస్తగిరి అహ్మద్, జి.రామిరెడ్డి, బాలగురవయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉదయగిరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు సుమారు వెయ్యి మంది వరకు ఉన్నారన్నారు. వారికి హాస్టల్ సౌకర్యం కల్పిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు.

రేపట్నుంచి ఆలయ వార్షిక వేడుకలు

ఉదయగిరి రూరల్: మండలంలోని కృష్ణంపల్లిలో ఉన్న సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం నుంచి శనివారం వరకు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోహణ, నవగ్రహ మండపారాధన, పంచామృతాభిషేకాలు, పుట్టమన్ను తెచ్చుట, అశ్వవాహనంపై గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఇలా మూడు రోజుల పాటు వివిధ పూజలు, అభిషేకాలు జరగనున్నాయి.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం



కొండాపురం : కొమ్మి గ్రామంలో..



కావలిలో ఐరన్ సిరప్ పంపిణీ



దుత్తలూరు: బ్రహ్మేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో..

కొండాపురం: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని వింజమూరు ఐసీడీఎస్ అధికారి పద్మజ అన్నారు. ఆమె కొమ్మి గ్రామ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచి పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గర్భిణి, బాలింత తప్పకుండా తీసుకోవాలన్నారు. తల్లిపాల ద్వారా బిడ్డ ఎదుగుదల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చెరుకూరి అరుణ, ఆదిలక్ష్మి, దొరసాని, సుజాత తదితరులు పాల్గొన్నారు.

• **కావలి (జలదంకి):** తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి అన్నారు. రామ్‌సెంటర్ సహకారంతో పట్టణంలోని వైకుంఠపురం చేవూరివారితోట, చాకలి కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. అనంతరం ఐరన్ సిరప్‌లు, పౌష్టికాహారం అందించారు. రామ్‌సెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతిలక్ష్మి, కోటేశ్వరమ్మ, సచివాలయ పోలీస్ పవిత్ర పాల్గొన్నారు.

• **దుత్తలూరు:** తల్లిపాలు బిడ్డలకు శ్రేష్ఠకరమైనవని దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆయూబ్ అప్సర్ తెలిపారు. మండలంలోని బ్రహ్మేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ కార్యకర్త జానకి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతపై బాలింతలు, గర్భిణులకు వివరించారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి



కలిగిరి : మాట్లాడుతున్న కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత



అనుమసముద్రంపేట: మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

కలిగిరి: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత తెలిపారు. కలిగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ మండలంలోని అన్ని పాఠశాలల్లో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి, సీహెచ్‌ఓ సాయిలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

• **అనుమసముద్రంపేట:** మండలంలోని చిరుమన పీహెచ్‌సీలో జరుగుతున్న ఆశాడే కార్యక్రమాన్ని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం గర్భిణులకు అందుతున్న వైద్యసేవల గురించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిరాణి, పీహెచ్‌ఎన్ సుబ్బలక్ష్మి, హెచ్‌ఈఓ షఫీ, హెచ్‌వీ రమణమ్మ పాల్గొన్నారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన



ఉదయగిరి పట్టణంలో ర్యాలీ

ఉదయగిరి: ప్రభుత్వ వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సచివాలయ సిబ్బంది మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాట్సప్ గవర్నెన్సీ ద్వారా ప్రజలు 700 రకాల సేవలు పొందవచ్చన్నారు.

• **ఆత్మకూరురూరల్:** ప్రభుత్వ వాట్సప్ గవర్నెన్స్‌పై మండలంలోని వెన్నవాడలో సచివాలయ ఉద్యోగులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కిశోర్, వార్డు సభ్యుడు పసుపులేటి శ్రీరామ్, స్థానిక నాయకుడు మాధవ్, స్థానిక పాఠశాల హెచ్‌ఎం కలిశెట్టి రవీంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రుచిత, సంక్షేమ సహాయకుడు శ్రీను, మహిళా పోలీస్ అభినయ పాల్గొన్నారు.

• **అల్లూరు:** ప్రభుత్వ వాట్సప్ గవర్నెన్స్‌పై అల్లూరు నగర పంచాయతీ పరిధిలో సచివాలయ సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు, డీఈఓ వరప్రసాద్, సచివాలయ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.